సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 7 । మే । 2024



ప్రారంభమైన పుష్పగిరి బ్రహ్మోత్సవాలు

పుష్పగిరిలోని కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, లక్ష్మీ చెన్న కేశవ స్వామిల బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. - 8లో



బీటీ.. జ్ఞానం పంచడంలో మేటి!

వందేళ్లకుపైబడిన ఎంతో ఘన చరిత్ర కలిగిన మదనపల్లెలోని బీటీ కాలేజీ దక్షిణ భారత దేశపు శాంతినికేతన్‌గా నిలిచిపోయింది. - 8లో

మదనపల్లె: టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.190
రెండోరకం	రూ.100	రూ.140

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు: 356 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

కడప వాసికి బిజినెస్ మేనేజ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శిరీష

కడప కల్చరల్: కడపకు చెందిన ప్రముఖ విద్యావేత్త అలపర్తి పిచ్చయ్యచౌదరి, దుర్గారాం మారిల కుమార్తె శిరీషకు ప్రతిష్టాత్మక బిజినెస్ మేనేజ్‌మెంట్ అవార్డు–2024 లభించింది. అమెరికాలోని బ్లూ క్రాస్ సీనియర్ మేనేజర్‌గా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. అలపర్తి శిరీష కడప విద్యామందిర్ హైస్కూలులో విద్యను అభ్యసించారు. శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చేశారు. పది సంవత్సరాలుగా డెట్రాయిట్‌లోని బ్లూ క్రాస్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. గతంలో ఆమె మైక్రోసాఫ్ట్, సియాటిల్ సంస్థల్లో కూడా పనిచేశారు.

15 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



కడప స్పోర్ట్స్: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పరిధి ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి తెలిపారు. వేసవి తీవ్రత, సాధారణ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో మేనెల 1 నుంచి నిర్వహించాల్సిన వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు 15 నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 50 వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 8 నుంచి 14 సంవత్సరాలలోపు వయసు గల విద్యార్థులు ఈ వేసవి క్రీడాశిక్షణ శిబిరాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్




యాత్రికులకు వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: జిల్లా నుంచి పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి సోమవారం స్థానిక రాధాకృష్ణనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి మొత్తం 234 మంది హజ్ యాత్రకు వెళుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా రాధాకృష్ణనగర్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో 12 మందికి వ్యాక్సినేషన్ వేశామన్నారు. మిగిలిన వారికి 8వ తేదీన వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, అర్బన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉజీయుల్లా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమధుర, సీహెచ్‌ఓ మునిరెడ్డి పాల్గొన్నారు.

షర్మిల.. ఎందుకిలా..!

- పీసీసీ అధ్యక్షురాలి తీరుతో దూరమవుతున్న పార్టీ కేడర్
- తొలివిడత ప్రచారంలో కనిపించిన తులసిరెడ్డి మలివిడతలో లేరు
- బీజేపీని దూషిస్తూనే ఆదితో రహస్య మంతనాలు
- పార్టీలోనూ.. కుటుంబంలోనూ ఒంటరిగానే..



సాక్షి ప్రతినిధి, కడప: రాజన్న ఉండి ఉంటే రాష్ట్రం విడిపోయే అవకాశం లేదని ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ వాసులు విశ్వసిస్తున్నారు. ప్రజల ఆకాంక్షతో నిమిత్తం లేకుండా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా విభజించింది. కాంగ్రెస్ అంటేనే ఏపీలో ప్రజలు ఏవగించుకునే పరిస్థితి. అలాంటి పార్టీకి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన షర్మిల వ్యవహారశైలి కూడా ఏకపక్ష ధోరణిని ప్రతిబింబిస్తోంది. జిల్లాలో, రాష్ట్రంలో అంతా తానే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎప్పటి నుంచో కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న నాయకులు సైతం క్రమంగా దూరమవుతున్నారు. అనతికాలంలోనే వామ్మో షర్మిల అనే పరిస్థితి తలెత్తిందని పరిశీలకులు భావిస్తున్నారు.

పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి కేరాఫ్ అడ్రస్‌గా నజీర్ అహమ్మద్ పేరు వినిపించేది. షర్మిల బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే నజీర్ అహమ్మద్ ఆ పార్టీకి దూరమయ్యారు. రాజంపేట పార్లమెంటు అభ్యర్థిగా ఆయన పేరు ప్రతిపాదించినా తెలంగాణకు చెందిన ఎస్సే బాషిద్‌ను ఎంపిక చేశారు. కారణాలు వెల్లడించుకుండానే అభ్యర్థిని మార్పు చేయడంతో నజీర్ అహమ్మద్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. పైగా హైదరాబాద్‌లో స్థిరపడిన బాషిద్ ఎంపిక వెనుక డబ్బు మూటలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. కడప నగరానికి చెందిన బండి జకరయ్య పరిస్థితి అదే. కాంగ్రెస్ కార్యాలయానికి తాళాలు వేసిన సందర్భంలో సైతం ఆ పార్టీ జెండాను జకరయ్య వీడలేదు. పైగా కడప అభ్యర్థిత్వం రాత్రికి రాత్రే మార్పు చేశారు. జయరాజ్ గార్డెన్స్‌లో ఓ టీడీపీ నాయకుడితో ప్రత్యేక భేటీ అనంతరం వైఎస్సార్‌సీపీ నేతగా ఉన్న అఫ్జల్‌ఖాన్ తెరపైకి వచ్చారు. షర్మిల అంటే కాస్తో కూస్తో గౌరవం ఉన్నవారు కూడా ఆమె ఏకపక్ష చర్యలపై విస్తుపోతున్నారు.

తొలి విడత ప్రచారంలో ఉన్న తులసిరెడ్డి ఎక్కడ..?

కడప పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసిన షర్మిల తొలివిడత ప్రచారంలో డాక్టర్ ఎన్.తులసిరెడ్డి వెన్నంటే పర్యటించారు. జిల్లా వాసులకు పరిచయం చేస్తూ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తిరిగారు. రెండవ విడత ప్రచారంలో తులసిరెడ్డి ఎక్కడా లేరు. తన కంటే వాగ్ధాటి పటిమ ఉన్న తులసిరెడ్డిని కావాలనే దూరం పెట్టినట్లు తెలుస్తోంది. పైగా ఈ మారు షర్మిల పర్యటన కనీస సమాచారం కూడా లేనట్లు విశ్వసనీయ సమాచారం. మరో క్రియాశీలక మైనార్టీ నాయకుడు సర్తార్ పరిస్థితి కూడా అంతే అన్నట్లుగా ఉంది. వీరంతా షర్మిల కంటే ముందు కాంగ్రెస్ గణాన్ని జిల్లాలో విన్పించిన నాయకులు. ఇపుడు వారంతా షర్మిల వ్యవహారశైలి కారణంగా పట్టుమని పక్షం రోజుల వ్యవధిలో అంటీముట్టనట్లు ఉండిపోవాల్సిన పరిస్థితి తలెత్తిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

బీజేపీ అంటే మండిపాటు.. ఆదితో రహస్య మంతనాలు..

భారతీయ జనతా పార్టీ అంటేనే పీసీసీ అధ్యక్షురాలు మండిపడుతున్నారు. కాని జిల్లాలో జమ్మలమడుగు బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డితో సత్సంబంధాలు ఉన్నాయని, రహస్య మంతనాలు చేస్తున్నారని కాంగ్రెస్ వాదులు వాపోతున్నారు. ఇటీవల షర్మిల భర్త మొరుసుపల్లి అనిల్‌కుమార్ దేవగుడిలో ప్రత్యక్షంగా ఆదితో సమావేశమైనట్లు తెలుస్తోంది. జమ్మలమడుగు ప్రచారానికి వెళ్లిన ఆమె దేవగుడి సమీపంలో రూపాదారి పక్కన ఉన్న గోడౌన్ల వద్ద రాజకీయ చర్చలు సాగించినట్లు పలువురు వివరిస్తున్నారు. ఈ ద్వంద్వ వైఖరి తోనే సమస్య వచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కుటుంబంలో ఒంటరిగానే...

వైఎస్ కుటుంబంలో షర్మిల ఒంటరిగా కాంగ్రెస్ పార్టీలో మిగిలారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరులు వైఎస్ సుధీర్‌రెడ్డి, వైఎస్ రవీంద్రనాథరెడ్డి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూనే మరోమారు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ జిల్లా వాసుల మద్దతు కోరుతున్నారు. మేనల్లుడు యువరాజ్, మేనకోడలు దివ్య, సమీప కుటుంబ సభ్యులంతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం పనిచేస్తున్నారు. షర్మిల మాత్రమే కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. కాంగ్రెస్‌లో సైతం ఒంటెత్తు పోకడతో కేడర్‌కు దూరమవుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

సర్కారుపై సానుకూలం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెండింగ్ లేకుండా డీఏలన్నీ చెల్లింపు
- జీపీఎఫ్, సరెండర్ లీవులు, ఏపీజీఎల్‌ఐ చెల్లింపులు పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు
- డీఏలు ఎగ్గొట్టింది చంద్రబాబే
- మరోసారి నమ్మితే మూల్యం చెల్లించుకోవాల్సిందే



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు (ఫైల్)

మదనపల్లె సిటీ: ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు ఒకటి, రెండు మినహా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నీ విడుదల చేశారు. అన్ని ఆర్థిక ప్రయోజనాలు లభించడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల్లో సానుకూలత..

2019లో చంద్రబాబు దిగిపోయే సమయానికి పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలతో సహా ఇప్పటి వరకు ఉన్న డీఏలు, జీపీఎఫ్, ఏపీజీఎల్‌ఐ చెల్లించడంతో ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టమవుతోంది. 2023 వరకు సరెండర్ లీవులు కూడా మంజూరు చేసింది. దాదాపు అన్ని చెల్లింపులు పూర్తి కావడంతో ఉద్యోగులు ప్రభుత్వం పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేయకపోయినప్పటికీ ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతిన కుండా ఆ స్థానంలో జీపీఎస్‌ను రూపకల్పన చేసింది. వేతనాలు చెల్లింపులో కొద్ది రోజులు జాప్యం జరిగినా అన్ని రకాల ప్రయోజనాలు ఇవ్వడం మరవిపోరాదనే అభిప్రాయం ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్ల వేతనాలు చెల్లించడం కాస్త జాప్యం జరిగినా దాన్ని సీరియస్‌గా తీసుకోరాదని పలువురు పేర్కొంటున్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఉద్యోగుల పట్ల ఎలా వ్యవహరించారు, డీఏలు ఇవ్వడంలో ఎన్ని ఇబ్బందులు పెట్టారు, ఉద్యోగులపై దౌర్జన్యాలు ఇలా ఒక్కొక్కటిగా గుర్తు చేసుకుంటున్నారు.

పెన్షనర్లపై చంద్రబాబు చిన్నచూపు..

చంద్రబాబు తన హయాంలో పెన్షనర్లను చిన్నచూపు చూశారు. పెన్షనర్లకు డీఏలతోపాటు వారికి డీఏలను ఎగ్గొట్టిన ఘనత ఆయనదే. చంద్రబాబు పాలనలో అవమానానికి గురైన కొందరు పెన్షనర్లు ప్రస్తుతం ఆయనకు వత్తాసు పలుకుతుండటాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

జగన్ పాలనలో తగ్గిన పని భారం..

సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల యావత్తు ఉద్యోగాలు లభించాయి. గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో అధికారులపై పని ఒత్తిడి లేకుండా, ఆదివారం కూడా సెలవులు దా నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం సాధ్యమైంది.

ఉద్యోగుల పట్ల జగన్ స్నేహభావం



చంద్రబాబుతో పోలిస్తే జగన్ ఉద్యోగుల పట్ల స్నేహభావంతో ఉంటారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనీసం ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు అమలు చేశారు.

–హైదర్‌వలీ, విశ్రాంత ఉద్యోగి, మదనపల్లె

కష్టకాలంలో కూడా పెన్షన్ ఇచ్చారు



మాకు ప్రతి నెలా మొదటి వారంలో పెన్షన్ వస్తుంది. కరోనా వంటి కష్టమైన పరిస్థితుల్లో ఇటు సంక్షేమం, ఉద్యోగుల వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్ సకాలంలో ఇచ్చారు.

–జీవీ ప్రసాద్, విశ్రాంత ఉద్యోగి, మదనపల్లె

ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి యం అభిషిక్త్ కిషోర్



రాయచోటి: జిల్లాలో విజయవంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గానికి రెండుబ్యాలెట్ యూనిట్లను వాడాల్సిన అవసరం వచ్చిందన్నారు. ఈటీపీబీఎస్ ద్వారా 1683 సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్లు జారీ చేశామన్నారు. హోమ్ ఓటింగ్ ద్వారా 580 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మంగళ, బుధవారం (7,8 తేదీలలో) కూడా నియోజకవర్గాల ఆర్‌ఓ కార్యాలయాలలో, జిల్లా కేంద్రంలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కల్పించామని పేర్కొన్నారు. మొత్తం ఈ రెండు రోజుల్లో 14201 ఓట్లు పోల్ అయ్యాయన్నారు. అలాగే జిల్లా ప్రధాన కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రం రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కాలేజీలో ఆరు నియోజకవర్గాల స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేశామన్నారు.

1210 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్..

ఈసీఐ నిబంధనల ప్రకారం జిల్లాలో రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె మూడు నియోజకవర్గాలలో నూరుశాతం వెబ్ కాస్టింగ్ చేస్తున్నామన్నారు. మిగిలిన నియోజకవర్గాలలో 50శాతం కంటే ఎక్కువ గుర్తించిన పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఉంటుందన్నారు. అధికంగా సుమారు 270 పోలింగ్ కేంద్రాలలో వీడియోగ్రఫీ కూడా చేస్తున్నామని వివరించారు. సుమారు 75శాతం మేర మొత్తం 1210 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ చేస్తున్నామని తెలిపారు.

10 లక్షల సమాచార స్లిప్పులు పంపిణీ...

జిల్లాలో 14 లక్షల ఓటరు సమాచార స్లిప్పుల్లో 10 లక్షలు పంపిణీ చేశామని, మిగిలిన నాలుగు లక్షల స్లిప్పులను రెండు రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. పోలింగ్ సందర్భంగా రెండు రోజుల ముందు సైలెంట్ పీరియడ్ ఉంటుందన్నారు.

7 గంటల నుంచి 6 గంటల వరకు..

పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిలుచున్న వారికి ఆరు గంటల తరువాత కూడా పోలింగ్ జరిగే అవకాశం ఉన్నందున ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన మేర లైటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ప్రశాంతంగా వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేస్తూ, ఎన్నికలను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల
బాహాబాహీ

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో నిరుఫ్పుగప్పిన నిప్పులా ఉన్న వర్గ విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పీలేరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పర్యటనలో టీడీపీలోని ఇరువర్గాలు బాహాబాహీకి తలపడడం గమనార్హం. వివరాల్లోకెళితే.. గుర్రంకొండ పట్టణంలో టీడీపీ రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం పోటాపోటీగా కార్యక్రమాలను గతంలో నిర్వహించారు. చాలా కాలంగా టీడీపీలో వర్గపోరు నడుస్తోంది. ఈ నేపథ్యంలో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సోమవారం మండలంలోని మర్రిపాడు, టి.రాచపల్లె, రామాపురం, మర్రిమాకులపల్లె, అమిలేపల్లె, తెట్టెవారిపల్లె గ్రామాల్లో వేర్వేరుగా కార్యక్రమ సమావేశాలు నిర్వహించారు. గుర్రంకొండకు చెందిన రెండువర్గాల వారి వాహనాలు బురుజుపల్లె వద్ద ఒకదాని వెనుక ఒకటి వెళుతున్నాయి. ఒక వర్గానికి చెందిన వాహనం డ్రైవర్ ఎక్కువ మార్లు హారన్ కొట్టాడు. దీంతో ఆగ్రహించిన ముందువున్న వాహనంలోని వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని నిలిపేశారు. ఆ వాహనంలో ప్రయాణిస్తున్న నాయకుడు ఒక్కసారిగా వాహనం దిగి మరో వర్గం వాహనంలోని డ్రైవర్‌పై దాడికి దిగారు. దీంతో పరస్పరం కిషోర్ పర్యటన కాన్వాయ్‌లో బాహాబాహీకి తలపడ్డారు. నాయకులు అక్కడికి చేరుకొని వారిని శాంతింపజేశారు. అయితే ఈ నేపథ్యంలో పట్టణంలో మరోసారి ఇరువర్గాల మధ్య ఘర్షణలు పాల్పడతారేమోనని భయాందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 83.79 శాతం

- రెండో రోజు ప్రశాంతం
- 17061 మందికి 14296 మంది ఓటు హక్కు వినియోగం
- పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి



రాజంపేటలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రెండో రోజు జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కార్యక్రమం ప్రశాంతంగా, పకడ్బందీగా జరిగింది. సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 17061 మంది పోస్టల్ బ్యాలెట్‌కు నమోదు చేసుకున్నారు. అయితే వీరిలో 14296 మంది ఓటును వినియోగించుకున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 83.79 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాలలో పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పర్యవేక్షించారు. జిల్లా ఫెసిలిటేషన్ సెంటర్‌లో 3188 మందికి గాను ఆదివారం 1445 మంది, సోమవారం 974 మంది మాత్రమే ఓటు వేయడంతో 75.88 శాతంగా నమోదైంది.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై ప్రత్యేక దృష్టి

రాజంపేట: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పకడ్బందీగా జరిగేందుకు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ అన్నారు. సోమవారం రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఆయన వెంట రాజంపేట రిటర్నింగ్ ఆఫీసర్ మోహనరావు, రాజంపేట మున్సిపల్ కమిషనర్ రాంబాబు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఆది, సోమ వారాల్లో నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలు..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	ఓటు వేసినవారు	పోలింగ్ శాతం
రాజంపేట	2237	1386	80.78
రైల్వేకోడూరు	1611	1120	69.52
రాయచోటి	2816	2545	90.38
తంబళ్లపల్లె	1639	1496	91.28
పీలేరు	2507	2304	91.90
మదనపల్లె	3063	2605	85.05

మేలు చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- నందిమండలంలో భారీ బైకు ర్యాలీ, రోడ్‌షో



చింతకొమ్మదిన్నెలో రోడ్ షోలో పాల్గొన్న కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

పెండ్లిమర్రి: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి మేలు చేసిన జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. సోమవారం పెండ్లిమర్రి మండలం నందిమండలం పాపాఘ్ని బ్రిడ్జి వద్ద నుంచి నందిమండలం గ్రామం వరకు భారీ బైక్ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో చెప్పిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని కొన్ని వందల హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మేనిఫెస్టోను చెత్త బుట్టలో వేసి ప్రజలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. అలాంటి వ్యక్తిని నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. చంద్రబాబుకు లేనిది.. జగనన్నకు ఉన్నది ప్రజాబలం, విశ్వసనీయత అని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రకటించింది సూపర్ సిక్స్ కాదని అందమైన ఆరు అబద్ధాలన్నారు.

పింఛన్ల పాపం చంద్రబాబుదే

ప్రతి నెల ఒకటో తేదీన ఠంఛన్‌గా ఇంటి వద్దకు వచ్చే పింఛన్ ఎన్నికల్లో ఓడిపోతోందని చంద్రబాబు నిమ్మగడ్డ రమేష్‌తో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారన్నారు. పింఛన్ డబ్బుల కోసం అవ్వాతాతలు పడుతున్న అవస్థల పాపం ఊరికేపోదన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

జగనన్న ప్రభుత్వం మళ్లీ వస్తే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కొప్పర్తి ప్రాంతీయ పారిశ్రామికవాడలో 6600 ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. రూ.100 కోట్లతో బ్రహ్మం సాగర్ నుంచి పైప్‌లైను ద్వారా నీటిని తీసుకువస్తున్నారని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో క్రీనీటి కన్నా ఎక్కువ పరిశ్రమలు ఏర్పాటు చేసి దాదాపు లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారన్నారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ప్రభుత్వ సలహాదారు రాజోలి వీరారెడ్డి, నందిమండలం ఇన్‌చార్జి సుబ్బారెడ్డి మాట్లాడారు.

సంక్షేమ పథకాలు సాగాలంటే మళ్లీ జగనే రావాలి

చింతకొమ్మదిన్నె: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, జెడ్పీటీసీ నరేష్ రామాంజుల రెడ్డి అన్నారు.

● ప్రచారం.. సకుటుంబ సమేతం




గుర్రంకొండ: ప్రచారంలో ఎమ్మెల్యే చింతల తనయుడు సాయికృష్ణారెడ్డి



సిద్దవటం మండలం మాధవరం–1లో ప్రచారంలో సాయి భరత్‌రెడ్డి

ప్రచార పర్వం



లక్కిరెడ్డిపల్లె: దిన్నెపాడులో మాజీ ఎమ్మెల్యేలు మోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి ప్రచారం



ములకలచెరువు: కురవపల్లెలో ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వం జోరందుకుంది. బరిలో నిలిచిన అభ్యర్థులకు మద్దతుగా కుటుంబ సభ్యులు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా అభ్యర్థుల సతీమణులు, సోదరులు, కుమారులు, కుమార్తెలు ఇలా ఎవరి పరిధిలో వారు ఆయా నియోజకవర్గాల్లో తమ వారి విజయం కోసం ముందుకెళ్లి చెమటోడుస్తున్నారు. తెల్లవారింది మొదలు కార్యకర్తలను వెంటేసుకుని గడప గడపకూ తిరుగుతున్నారు. వీధి వ్యాపారులను కలుస్తున్నారు. సామాన్యుల వద్దకు వెళుతున్నారు. కార్మికులు, కర్షకులు, వృద్ధులు ఇలా వివిధ వర్గాల వారితో ఆత్మీయంగా మమేకమవుతున్నారు. ప్రజలకు తమ కుటుంబ సభ్యులు చేసిన సేవలను వివరిస్తున్నారు. పలు కుటుంబాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేస్తున్నారు. ఎన్నికల ప్రచారం ఆసక్తికరంగా మారింది.

– సాక్షి నెట్‌వర్క్

కల్యాణం..కమనీయం



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరిదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వేద పండుతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మెస్ దగ్ధం



పోరుమామిళ్ల : పట్టణ శివారులో మైదుకూరు రోడ్డులో ఉన్న గాన్విక మెస్ సోమవారం సాయంత్రం పూర్తిగా దగ్ధమయింది. విద్యుతాఘాతంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. మెస్ ముందు వైపు బోద గడ్డితో నిర్మించడం, సాయంత్రం గాలి పెద్దగా రావడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి రెండు నిర్మాణాలు కాలిపోయాయి. అందులో ఉన్న పాత్రలు, వంట సామాగ్రి, కిరాణా సరుకులు, కూరగాయలు కాలిపోయాయి. రూ. 4 లక్షలు నష్టం జరిగిందని.. మెస్ ఓనర్ అవుకు మనోహర్ వాపోయాడు.

బీటీ.. జ్ఞానం పంచడంలో మేటి



బీటీ ప్రభుత్వ కాలేజీ ముఖద్వారం



బీటీ కాలేజీ వ్యూ

- ఎంతో మందికి రాజకీయ పునాది వేసిన బీటీ కాలేజీ
- విద్యార్థి సంఘాలతో పునాది
- చదువుతో పాటు సమాజ సేవ నేర్పిన వైనం

మదనపల్లె సిటీ : వందేళ్లకుపైబడిన ఎంతో ఘన చరిత్ర కలిగిన బీటీ కాలేజీ (ప్రభుత్వ బీటీ కాలేజీ) దక్షిణ భారత దేశపు శాంతినికేతన్‌గా నిలిచిపోయింది. రాయలసీమలోనే మొట్టమొదటి డిగ్రీ కాలేజీ. 1915లో ఐరిష్ వనిత డాక్టర్ అనిబిసెంట్ మదనపల్లెలో నేషనల్ కాలేజీ (బీటీ) ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో విద్యాజ్యోతులు వెలిగించింది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో బీటీ కాలేజీ ఉద్యమాలకు కేంద్ర బిందువుగా నిలిచింది. ఎన్నో సామాజిక, రాజకీయ ఉద్యమాలకు, మేధో చర్చలకు కాలేజీ వేదికైంది. ఎంతో మంది మేధావులు, రాజకీయ నాయకులు, కళాకారులు, సాహితీవేత్తలు, వ్యాపారవేత్తలను తయారు చేసింది. ఒకప్పుడు కాలేజీలో విద్యార్థులుగా చేరిన పలువురు రాజకీయ నేతలుగా ఎదిగారు. ప్రజాప్రతినిధులుగా మన్ననలు పొందారు. సమాజ సేవకు అంకితమై నేడు రాజకీయాల్లో రాణిస్తున్నారు.

మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి

ఉమ్మడి ఆంధ్ర రాష్ట ముఖ్యమంత్రిగా చేసిన కోట్ల విజయభాస్కరరెడ్డి బీటీ కాలేజీలో చదువుకున్నారు. ఆయన మంచి హాకీ క్రీడాకారుడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. ఆయన ఇక్కడే విద్యాబుద్ధులు నేర్చుకుని రాజకీయ నేతగా పేరు ప్రఖ్యాతులు గడించారు.

మాజీ గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య

కర్నాటక మాజీ గవర్నర్‌గా పని చేసిన పెండేకంటి వెంకటసుబ్బయ్య బీటీ కాలేజీలో విద్యను అభ్యసించారు. క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని రాజకీయవేత్తగా రాణించారు.

- పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బీటీ కాలేజీలో చదువుకున్నారు. ఇక్కడే ఆయనకు రాజకీయవేత్తగా బీజం పడింది. వాయల్పాడు ఎమ్మెల్యేగా పని చేశారు. ప్రస్తుతం పీలేరు ఎమ్మెల్యేగా ఉన్నారు.
- మదనపల్లె వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.నిస్సార్ అహ్మద్ బీటీ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుకున్నారు. ఇక్కడ విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు.
- మాజీ ఎమ్మెల్యే బి.నరేష్‌కుమార్‌రెడ్డి బీ.టీ కాలేజీలో చదువుకున్నారు. విద్యార్థి సంఘ నాయకులుగా పేరు తెచ్చుకున్నారు. ఆయన మదనపల్లె మున్సిపల్ చైర్మన్‌గా పని చేశారు.
- అనంతపురం జెడ్పీ చైర్మన్‌గా పని చేసిన తోపుదుర్తి కవిత బీటీ కాలేజీలోనే విద్యాభ్యాసం చేశారు.
- మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటా చలపతి బీటీ. కాలేజీ చదువుకున్నారు. కాలేజీ యూనియన్ చైర్మన్‌గా చేశారు. కాలేజీలోనే విద్యార్థి సంఘ చైర్మన్‌గా పని చేసి నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు.
- వీరితో పాటు అనంతపురం మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ, మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, బీజేపీ జాతీయ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, జనసేవ రాయలసీమ కో కన్వీనర్ రాందాస్ చౌదరి బీటీ కాలేజీలో చదువుకున్నారు. చదువు నేర్పిన మేధస్సు నింపుకోవడమే కాదు, ప్రజా సేవకూ తాము సై అంటూ కాలేజీ నుంచి రాజకీయ రంగంలోకి దూకారు.

క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన

- 240 మంది క్రీడాకారులు హాజరు
- ప్రాబబుల్స్ ఎంపిక



ఎంపికలను పరిశీలిస్తున్న సీఏవైడీ ప్రతినిధులు, సెలెక్టర్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. సీనియర్స్, అండర్-23, అండర్-19 విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపికలను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు క్రమశిక్షణ, అంకితభావం అవసరం అన్నారు. ప్రతిరోజూ సాధన చేయడం ద్వారా మీరు అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని సూచించారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులను తొలుత ప్రాబుబుల్స్‌కు ఎంపిక చేసి మ్యాచ్‌లు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశారు. సీనియర్ విభాగంలో 50 మందికి గాను 32 మందిని, అండర్-23 విభాగంలో 70 మందికి గాను 42 మందిని, అండర్-19 విభాగంలో 120 మందికి గాను 60 మందిని ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసినట్లు సెలెక్టర్లు తెలిపారు. ఎంపికలను సెలెక్టర్లు నజీర్ అహ్మద్, అబ్దుల్ ఫరూఖ్ రెహమాన్, శివప్రసాద్, ఆనంద్‌కుమార్, పైడికాల్వ విజయ్‌కుమార్, మణికుమార్‌రెడ్డి, విష్ణుప్రసాద్ పరిశీలించారు. కార్యక్రమంలో సీఏవైడీ సంయుక్త కార్యదర్శి ఎం. సాయిపృధ్వి తేజ్, సిరాజుద్దీన్ దౌలా, సంజయ్‌కుమార్‌రెడ్డి, మునికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8న ప్రపంచ తలసీమియా దినోత్సవం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 8న కడప టౌన్ బుక్ సెల్లర్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ తలసీమియా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తలసీమియా డే సందర్భంగా రిమ్స్ హాస్పిటల్ సహకారంతో తలసీమియా పిల్లలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా నేడు ప్రజానీకాన్ని భయపెడుతున్న వ్యాధుల్లో తలసీమియా ఒకటి. కేవలం జన్యుపరంగానే వచ్చే ఈ వ్యాధి నియంత్రణకు అనేక పరిశోధనలు కొనసాగుతున్నాయన్నారు. మనదేశంలో మూడు కోట్ల యాభై లక్షల మందికి పైగా తలసీమియా బారినపడ్డారన్నారు. తల్లిదండ్రుల్లో ఉండే జన్యుపరమైన లోపాల వల్లగానీ, జన్యువుల్లో వ్యత్యాసాల వల్లగానీ ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. కడప టౌన్ బుక్ సెల్లర్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మైలాపురం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వంద కుటుంబాలు



పార్టీలో చేరిన వెంకటరాజంపేట యువతతో సీనియర్ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి

రాజంపేట రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా దక్షతను, రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న విశేష కృషికి ఆకర్షితులై వెంకటరాజంపేట గ్రామానికి చెందిన 100 కుటుంబాలకు చెందిన యువత వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పట్టణంలోని ఆకేపాటి భవన్(వైఎస్సార్సీపీ కార్యాలయం) లోకి సోమవారం యువనాయకుడు ఉద్దండం శ్రీనివాసులు ఆధ్వర్యంలో విచ్చేసిన 100 మంది యువకులకు రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి సోదరుడు అనీల్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో శశిధర్, బాస్కర్, గోపీ, మహేష్, శివకుమార్, కార్తవరాముడు, అవినాష్, శ్రీనివాసులు, ప్రశాంత్, కిరణ్, ఉపేంద్ర, గణేష్, విజయ్, శ్రీనాథ్, రమణబాబు. తదితరులు ఉన్నారు.

గాలివానకు నేలకూలిన చెట్లు



ప్రధాన రహదారిపై కూలిన వేపచెట్టు

అట్లూరు : అట్లూరు మండల పరిధిలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించాయి. గాలికి అట్లూరు, రెడ్డిపల్లె, కొండూరు గ్రామాల్లో పలు చెట్లు కూలిపోయాయి. పలు విద్యుత్ స్తంభాలు కూడా నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కడప - బద్వేలు ప్రధాన రహదారిపై అట్లూరు పోలీసుస్టేషన్ ఎదురుగా వేప చెట్టు రోడ్డుపై అడ్డంగా పడటం, విద్యుత్ వైర్లు తెగి పడటంతో గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక ఎస్‌ఐ కె.సి.రాజు స్థానికుల సహాయంతో విరిగిపడిన చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ప్రారంభమైన పుష్పగిరి బ్రహ్మోత్సవాలు



హంస వాహనంలో వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ధ్వజారోహణం

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి , శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు సోమవారం రెండు ఆలయాల్లో నిర్వహించిన ధ్వజారోహణం కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ నిర్వహించారు. వైద్యనాధునికి రుద్రాభిషేకం, శ్రీ చక్ర సహిత కామాక్షీ దేవికి కుంకుమార్చన చేశారు. రాత్రి ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. నందీశ్వరుని చిత్ర పటాన్ని ధ్వజ స్థంభంపై అధిష్టింప చేశారు. రాత్రి హంస వాహనంపై శ్రీ కామాక్షీ వైద్యనాధ స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో తెల్లవారు జామున సుప్రభాత సేవ జరిగింది. అనంతరం ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజను నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలతో ప్రారంభించి గరుడుని చిత్ర పటాన్ని ధ్వజ స్థంభంపై అధిష్టింప చేశారు. అనంతరం కొండపై నుంచి వారిని తిరుచ్చి వాహనంలో మోస్తూ గ్రామ మాడ వీధుల్లో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో శ్రీ వైద్యనాథ స్వామి ఆలయ ధ్వజస్థంభ దాత మీగడ శేషారెడ్డి పాల్గొన్నారు.

పుష్పగిరిలో నేడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, కుంకుమార్చన జరుగుతాయి. రాత్రి స్వామి వారికి సింహవాహన సేవ జరుగుతుంది. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, తోమాల సేవ ఉంటుంది. రాత్రి స్వామివారికి హంసవాహన సేవ జరుగుతుంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ శివార్లలోని టీటీడీ కల్యాణ మండపానికి ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 50-55 వయస్సు మధ్య గల) మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. అర్బన్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణంలోని రాయచోటి - చిత్తూరు రోడ్డు వద్ద ఉన్న ఫిష్ మార్కెట్‌కు వెనుక భాగాన టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం ఉన్నట్లు స్థానికులు సమాచారమివ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. మూడు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడనే అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు తెల్లటి ఫ్యాంట్, నల్ల గళ్ల చొక్కా, తెల్లటి హవాయీ చెప్పులు ధరించాడని, అలాగే తెల్లటి గడ్డంతో ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా గుర్తించి ఆనవాళ్లు తెలిసిన వారు ఉంటే తమకు తెలియచేయాలని చెప్పారు. తమ ఫోన్ నంబర్ 9121100559 /560/561లకు ఫోన్ చేయవల్సిందిగా కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వల్లూరు : కడప- తాడిపత్రి ప్రధాన రహదారిపై విమానాశ్రయం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. విమానాశ్రయం సమీపంలో రోడ్డు దాటుకుంటున్న గుర్తు తెలియని వ్యక్తిని కడప వైపు నుంచి యర్రగుంట్ల వైపుకు వెళుతున్న లారీ ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ వెంకట రమణ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అల్లర్లు సృష్టించడం బాబుకే చెల్లు

- రాష్ట్రాన్ని ముక్కలుగా చేసిన పాపం చంద్రబాబు, కిరణ్‌దే
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



పెద్దతిప్పసముద్రంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం : టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు, భయానక వాతావరణం కల్పించేలా అల్లర్లు సృష్టించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పెద్దతిప్పసముద్రంలో మాట్లాడారు. ఉమ్మడిగా ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని ముక్కలుగా చేసిన పాపం మాజీ సీఎంలు చంద్రబాబు, కిరణ్‌లకే దక్కాయని ఎద్దేవా చేసారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగే ప్రదేశంలో కూటమి అభ్యర్థులు సమావేశం నిర్వహించడం ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కాదా అని ప్రశ్నించారు. ఈ సారి ఎలాగైనా అధికారంలోకి రావాలనే తపనతో చంద్రబాబు, కిరణ్, లోకేష్, కిషోర్‌కుమార్ రెడ్డి తెర వెనుక కుట్రలు పన్నుతూ ప్రజలను రెచ్చగొడుతున్నారని అయినా తనతో పాటు వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు సంయమనం పాటిస్తున్నామన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో వేరే చోట కాకుండా అంగళ్లులోనే చంద్రబాబు ఇన్నిసార్లు సభలు పెట్టడం వెనుక మతలబు ఏమిటని సూటిగా ప్రశ్నించారు. 'నువ్వే చంద్రగిరి వదిలి కుప్పానికి వచ్చి అక్కడ అభివృద్ధిని గాలికొదిలేశావ్, నీ తోడబుట్టిన తమ్ముడు ఎక్కడ ఉన్నాడో ప్రజలకు చెప్పవు' అంటూ బాబును ప్రశ్నించారు. ముఖ్యమంత్రులుగా చంద్రబాబు, కిరణ్‌లు తంబళ్ళపల్లిలో ఏం అభివృద్ధి సాధించారని, తాను రేపే తప్పుకుంటా, దమ్ముంటే తనపై పోటీకి సిద్ధమా అంటూ చంద్రబాబు, కిరణ్, లోకేష్‌లకు సవాల్ విసిరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో తంబళ్లపల్లెను అన్ని విధాలా అభివృద్ధి చేశానని ధీమా వ్యక్తం చేసారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, గణపతిరెడ్డి, డ్రిప్ రమణ, రియాసత్ అలీఖాన్, సుబ్బరాం, అనిత, తమకశంకర్, కార్యం చంద్ర, ధనలక్ష్మి, కొట్టి మల్లి, భాస్కర్‌రెడ్డి, ఆసిఫ్,సుబ్బిరెడ్డి, ఖాదర్‌వలి, కేసవ్, సందీప్, సాదిక్, పుజేల్, నాయుడు, వెంకట్రమణ తదితరులు ఉన్నారు.

కలుషిత నీరు తాగి 18 జీవాలు మృతి



విషపు నీరు తాగి మృతిచెందిన గొర్రెలు

కలకడ : విషపు నీరు తాగి 18 గొర్రెలు మృతి చెందిన సంఘటన కలకడ మండలం దిగువతాండలో సోమవారం జరిగింది. నడిమిచెర్ల వెటర్నిటి వైద్యాధికారిణి డాక్టర్ పూర్ణిమ కథనం మేరకు.. దిగువతాండకు చెందిన భీముడునాయక్ కుమారుడు రవినాయక్ గొర్లు మేపుకుని వారి కుటుంబాన్ని పోషించుకుంటూ ఉన్నాడు. సోమవారం ఉదయం మేతకోసం ఇంటినుంచి బయటకు వెళ్లిన గొర్లు మధ్యహ్నం నీరు తాగిన గంట సమయంలోపే సొమ్మసిల్లి పడియాయి. దీంతో తీవ్ర ఆందోళన చెందిన రవినాయక్ దంపతులు గ్రామస్తులకు, పశువైద్యాధికారికి సమాచారం అందించారు. వారు వచ్చి పరీశీలించే లోపే 18గొర్లు మృతిచెందగా, మరో రెండు గొర్లు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. మృతిచెందిన గొర్లు నుంచి రక్తనమూనాలు సేకరించి, విషపు నీరు తాగడం వల్లే మృతిచెంది ఉండవచ్చునని ఉన్నతాధికారులు తెలిపారు. రక్తపరీక్షల రిపోర్ట్ వచ్చిన అనంతరం పూర్తి నివేదిక అందించడం జరుగుతుందని తెలిపారు. గొర్రెల కాపరి వైఎస్సార్‌సీపీ అభిమాని అని, ఎవరైనా కక్షతో చేశారా, నీటిలోకి విషం ఎలావచ్చిందిఅనే అనుమానాలు కలుగుతున్నాయి. గొర్రెలకాపరిని వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోన్ ఎస్టీసెల్ కార్యదర్శి డాక్టర్ సురేష్‌నాయక్, స్థానిక సర్పంచ్ స్వాతి లు కలిసి పరామర్శించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.